
# రైల్వేకోడూరులో అవినీతి జలగలు..!





కోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

- స్వాహా నిధులు ఎవరి జేబులోకి..?
- ఆ నాయకుడికా? అధికారులకా?
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం
- నామమాత్రంగా విచారణ

రైల్వేకోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు కాజేయడంలో బాగా రుచిమరిగిన కొన్ని అవినీతి జలగలు రైల్వేకోడూరు మేజర్ గ్రామ పంచాయతీపైన పడ్డాయి. తాము ప్రభుత్వ ఉద్యోగులమనీ.. ప్రజల సొమ్ముకు జవాబుదారీగా ఉండాలని, రాజకీయ నాయకులు ఈరోజు ఉంటారు.. రేపు వెళ్లిపోతారు.. తమ అవినీతి బాగోతం బయటపడితే శిక్ష తప్పదనే భయమే లేకుండా.. ఆ జలగలు బరి తెగించాయి. పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి దర్జాగా లక్షలాది రూపాయలు కాజేశాయి. అయితే ఆ కాజేసిన సొమ్ము అధికారికా..? ఆ అధికారికి అన్నీ తానై అండగా ఉంటున్న నాయకునికా? అని పట్టణంలో విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో జిల్లా అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఇంతవరకు అవినీతి జలగల జోలికి వెళ్లలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ జలగల అవినీతి బాగోతంపై తూతూమంత్రంగా విచారణ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

రైల్వేకోడూరు మేజర్ గ్రామ పంచాయతీకి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, గదులు, బండ్ల మిట్ట, కూరగాయల మార్కెట్ వంటి మార్గాల ద్వారా ఏడాదికి రూ.2 కోట్ల ఆదాయం వస్తుంది. వీటితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.90 లక్షలు వచ్చాయి. ఈ నిధులతో పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పంచాయతీ ఆదాయంలో పారిశుధ్య కార్మికులు, సిబ్బంది జీతాలు, విద్యుత్ బకాయిలు, డ్రైనేజీ క్లీనింగ్, మరమ్మతులు వంటి వాటి చెల్లింపులూ జరుగుతుంటాయి. అయితే ఇటీవల పంచాయతీలో అవినీతి జలగల జోరు ఎక్కువైందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పంచాయతీలో పనిచేసే ఓ అధికారి ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో సాక్షాత్తు పంచాయతీ కార్యదర్శి సంతకాన్నే ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు స్వాహా చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా స్వాహా చేసిన డబ్బు ఎవరి జేబుల్లోకి చేరిందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంతకాలు ఫోర్జరీ చేసిన అధికారికా? ఆ అధికారికి అన్నీ తానై అండగా ఉన్న నాయకుడికి ఈ డబ్బు చేరిందా? అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇంకా కొందరు వాటాలు పంచుకున్నారా? అనే అనుమానాలూ ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేసిన అధికారి గత ప్రభుత్వ హయాం నుంచి ఇక్కడే పనిచేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలోనూ ఇటువంటి అవినీతి బాగోతాలు ఎన్నో జరిగినట్లు ప్రచారంలో ఉంది. సంతకాల ఫోర్జరీ వ్యవహారాన్ని ఈవో వరప్రసాద్ రావు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బట్టబయలైంది. జిల్లా యంత్రాంగం హుటాహుటిన కోడూరు పంచాయతీలో విచారణ చేపట్టింది. రూ.74 లక్షల నిధులు నిబంధనల మేరకు పంచాయతీ తీర్మానం లేకుండానే ఖర్చు చేసినట్లు గుర్తించారు. పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు కలిపి 68 మంది ఉన్నారు. (ఇందులోనే పర్మనెంట్ ఉద్యోగులు ఉన్నారు). ప్రభుత్వం మారినప్పుడల్లా అవసరంతో సంబంధం లేకుండా సిబ్బందిని పెంచుకుంటూపోతున్నారు. చాలామందికి పనిలేకున్నా జీతాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా డీజిల్ బిల్లుల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



కోడూరు గ్రామ పంచాయతీలో విచారణ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ (ఫైల్)

## నామమాత్రపు విచారణ

ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేసిన వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారుల విచారణ సాగుతోందని పంచాయతీ సిబ్బంది అనుకుంటున్నారు. చాలాకాలంగా జరుగుతున్న ఈ అవినీతి తతంగంపై జిల్లా, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులు విచారణ పేరుతో వచ్చారే కానీ ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.



ఎన్‌వోసీ పత్రంలో ఈవో సంతకాన్ని ఫోర్జరీ చేసిన దృశ్యం

### విచారణ నివేదిక విజయవాడకు పంపించాము

ఈ వ్యవహారంపై విచారణ నివేదికను విజయవాడ కమిషనర్‌కు పంపినట్లు రాజంపేట డివిజన్ పంచాయతీ అధికారి మస్తాన్‌వల్లి తెలిపారు. రికార్డులు అన్నీ పరిశీలించామన్నారు. ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో జరిగిన ఫోర్జరీపై డీఎల్‌డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు విచారణకు వస్తాయన్నారు.

- మస్తాన్‌వలి, డివిజన్ పంచాయతీ అధికారి

### నిధుల దుర్వినియోగం అవాస్తవం

పంచాయతీ కార్యాలయంలో విధానపరమైన లోపాల వలన రూ.74 లక్షల నిధులను పంచాయతీ అభివృద్ధి పనుల కోసం వినియోగించాం. నిధుల దుర్వినియోగం ఆరోపణలు అవాస్తవం. ఇందుకు సంబంధించిన బిల్లులన్నింటిని విచారణాధికారులకు అప్పగించాం. పంచాయతీ కార్యాలయంలో ఓ అధికారి నిబంధనలను ఉల్లంఘించి ఇంటి ప్లానింగ్ అప్రూవల్స్ చేసినట్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాము. మేజర్ పంచాయతీ కావడంతో రోజూ పంచాయతీలో కనీస ఖర్చులు రూ.10 వేల వరకు వస్తుందన్నారు.

- బుడిగి శివయ్య, సర్పంచ్

### నా సంతకాలు ఫోర్జరీ చేశారు



ఇంటి ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేయడంలో నా సంతకాలు లేకుండా ఫోర్జరీ జరిగింది. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాము. పూర్తి నివేదికలు అధికారులకు ఇచ్చాము. నిధులు దుర్వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణలు నిజం కాదు. పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించిన నిధులకు సంబంధించిన రికార్డులు అధికారులకు అందజేశాము.

- వరప్రసాద్‌రావు, ఈవో

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

# వీరభద్రుడిని దర్శించుకున్న రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ



వీరభద్రాలయంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని ఆదివారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్ లాల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు వీరభద్రాలయంలోని వినాయకుడు, అఘోర లింగేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, భద్రకాళీ అమ్మవారు, వీరభద్రుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి ఆలయ విశిష్టతను తెలియజేసి సన్మానించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాద్ ఆధ్వర్యంలో పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.

# బాబా సేవా మార్గం ఆదర్శనీయం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



ఎన్జీవో సభ్యులతో కలిసి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా చూపిన సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శనీయమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్య సాయిబాబా చూపిన సేవా మార్గం సమాజంలోని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు నీటి సౌకర్యం అందడంలో సాయిబాబా చేసిన కృషి మరిచిపోలేనిదన్నారు. అందరినీ ప్రేమించాలి, అందరికీ ఉదార బావంతో సేవలందించాలని ఆయన చెప్పిన నినాదాన్ని అందరూ పాటించాలని సూచించారు. ఆయన పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు ఆసుపత్రులు ప్రపంచానికి ఆదర్శమన్నారు. జాతి, మతం, దేశం అనే భేదాలు లేకుండా ప్రపంచాన్ని ఏకం చేసిన మహానుభావుడన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఎన్జీవోల ప్రతినిధులు సత్యసాయి బాబా జీవితంలోని ముఖ్య విషయాలను తెలిపారు. అనంతరం సాయిబాబా భక్తులు ఆయన భజనలను చేసి ఆయనను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం, ఎన్జీవోల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ నాయకుల ఓవరాక్షన్

- మెడికల్ కాలేజీలోకి వెళ్లేందుకు యత్నం
- చితకబాది బుద్ధి చెప్పిన టీడీపీ నాయకులు
- గంట సేపు ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ద్వారకనాథరెడ్డి అనుచరుడు కోటిరెడ్డిపై దాడి



ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన వైసీపీ నాయకుడిని చితకబాదుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కాలేజి వద్దకు వెళ్లేందుకు ఆదివారం వైసీపీ నాయకులు ఓవరాక్షన్ చేయడంతో దానిని టీడీపీ నాయకులు తిప్పికొట్టి వారిని అక్కడి నుంచి తరమికొట్టారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరికి పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత సద్దుమణింగింది. మదనపల్లె మెడికల్ కాలేజిని పీపీపీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు శనివారం ఓ యూ ట్యూబ్ చానల్‌లో మాట్లాడారు. మదనపల్లె మెడికల్ కాలేజి నిర్మాణం, మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో వైద్యవిధాన పరిషత్ కింద వైసీపీ హయాంలో కల్పించిన తాత్కాలిక ఉద్యోగాలను పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అంగడిలో సరుకుల్లాగా విక్రయాలు చేశారని శ్రీరామ్‌చినబాబు తీవ్రంగా ఆరోపణలు చేశారు. దీనిపై తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు ఎంపీటీసీ మహేశ్ అతడి అనుచరులతో శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. చినబాబు చేసిన ఆరోపణలు సవాల్ చేస్తూ మదనపల్లె మండలంలోని ఆరోగ్యవరం వద్ద ఆదివారం ధర్నా చేస్తామని, దీనిని అడ్డుకోవాలంటూ చినబాబుకు తంబళ్లపల్లె వైసీపీ నాయకులు సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకే ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజి సమీపంలోకి తంబళ్లపల్లె వైసీపీ నాయకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీరామ్‌చినబాబు అనుచరులు మెడికల్ కాలేజ్ సమీపంలోకి వచ్చారు. అక్కడికి వస్తున్న తంబళ్లపల్లె వైసీపీ నాయకుడు కోటిరెడ్డితో పాటు వైసీపీ కార్యకర్తను అడ్డుకున్నారు. అక్కడ వైసీపీ నాయకులు ఓవర్‌యాక్షన్ చేయడంతో చినబాబు అనుచరులు ఒక్కసారిగా వైసీపీ నాయకులపై పడి చితకబాదారు. వైసీపీ పాలనలోనూ దౌర్జన్యం చేసిన మీరు టీడీపీ పాలనలోనూ దౌర్జన్యం చేయడానికి వస్తారా అంటూ దేహశుద్ధి చేశారు. ఎట్టకేలకు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అడ్డుకున్నారు. ఆరోగ్యవరం ఫ్లైఓవర్ వద్దనే నిలిచిపోయిన ద్వారకనాథరెడ్డి అనుచరులు బీరాలు పలుకుతూ ప్రెస్‌మీట్లు నిర్వహించి వెళ్లిపోయారు. కాగా ఈ ఘటనపై మదనపల్లె తాలూకా పోలీసులకు ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిసింది. కాగా అంగళ్లలో చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ నాయకులపై దాడి చేసి గాయపరిచిన ద్వారకనాధరెడ్డి అనుచరుడు కోటిరెడ్డి, ప్రస్తుతం ఆరోగ్యవరం వద్ద కూడా టీడీపీ నాయకులపై దాడి చేసేందుకు వచ్చి చివరికి వారి చేతిలో దెబ్బలు తిని వెనుతిరిగాడు.


రేపు మాజీ సీఎం జగన్ కడప జిల్లా పర్యటన 7

పోలీసుల సివిల్ పంచాయితీలు
చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే వరద 7

మత్స్యకారుల సంక్షేమానికి కృషి


# కిలో టమోటా రూ.65

- వర్షంతో దెబ్బతిన్న కాయలు

కలకడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలకడ మార్కెట్‌లో ఆదివారం నాణ్యమైన 15 కిలోల టమోటా క్రేట్ ధర రూ.వెయ్యి పలికింది. ఈ వంతున రైతుకు సరాసరి కిలోకు రూ.65 గిట్టుబాటు అయింది. ఈ మార్కెట్ నుంచి తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు, ఆంధ్ర, చత్తీస్‌గడ్, ఒడిస్సా రాష్ట్రాలకు టమోటాలు ఎగుమతి చేస్తున్నారు. అయితే నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోటల్లో కాయలు దెబ్బతిని నాణ్యత తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 100 క్రేట్‌లను గ్రేడింగ్ చేస్తే అందులో 40 శాతం మాత్రమే నాణ్యమైన సరుకు వస్తోందని తెలిపారు. మిగిలిన కాయలలో రంధ్రాలు ఏర్పడి మచ్చలు రావడంతో వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదని వాపోయారు. కారణంగా దెబ్బతిన్న సరుకును పారబోయడం తప్ప వేరే గత్యంతరం లేదని తెలిపారు. వర్షాలు ఎక్కువైతే మరింత నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందేమోనని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.



టమోటా గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

# రైల్వేకోడూరులో భారీ వర్షం

- జలమయమైన రహదారులు
- ప్రవహిస్తున్న గుంజనేరు



జలమయమైన రైల్వేకోడూరు ప్రధాన దారి

రైల్వేకోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. రైల్వేస్టేషన్ రోడ్డు, కడప-తిరుపతి ప్రధానదారి తదితర రోడ్లు జలమయమయ్యాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గుంజన, ముష్టేరు, మేకల గుంతేరు, తిరుపతి ఏరు, గుండాలేరు తదితర నదులు ప్రవహిస్తున్నాయి. కోడూరు-రెడ్డివారిపల్లె, పొట్టిరాజుగారిపల్లె-గంగురాజుపోడు గ్రామాల మధ్య చాలా కాలంగా తాత్కాలిక రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్లు చాలాసార్లు తెగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాత్కాలిక రోడ్లు ఎక్కడ తెగిపోతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెడ్డివారిపల్లె, పొట్టిరాజుగారిపల్లె వద్ద ఉన్న తాత్కాలిక రోడ్లు కొంచెం, కొంచెం దెబ్బతింటున్నాయి. భారీ వర్షాలు కురిస్తే తాత్కాలిక రోడ్లు తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నరసరాంపేట, ధర్మాపురం, గాండ్లవీధి, చిన్నలాలాపేట తదితర నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ప్రవహిస్తున్న గుంజనేరు

# నేటి నుంచి రైతన్నా.. మీకోసం

- జిల్లాలో ఆరు రోజుల పాటు సర్వే
- పంచసూత్ర ప్రణాళికలపై అవగాహన
- రైతుల ఇళ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు
- రబీ, ఖరీఫ్ పంట ప్రణాళికలపై ఆరా



మదనపల్లె టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతే రాజు.. రైతులు బాగుంటే దేశం బాగుంటుంది అన్న నానుడిని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించనుంది. రబీ, రాబోయే ఖరీఫ్ సీజన్‌లలో పంట సాగు చేసే రైతుల ఇళ్లకు అధికారులు, ప్రజా ప్రతినిధులు బారులు తీరనున్నారు. రాబోయే ఐదేళ్లలో రైతును రాజుగా చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన పంచ సూత్రాల కార్యాచరణ అమలు చేయనున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన అంశాలపై ఆరు రోజుల పాటు సర్వే నిర్వహించడంతో పాటు పంచసూత్ర ప్రణాళికలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

## 1.90 లక్షల మంది ఇళ్లకు 298 బృందాలు

జిల్లాలో 1.90 లక్షల మందికి పైగా రైతులు వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏటా రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తూ రాష్ట్ర జీఎస్‌డీపీలో 35 శాతం వాటా అందిస్తున్నారు. ప్రజల తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలు చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సరాసరిన ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు పెంచడమే లక్ష్యంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ నేతృత్వంలో డీఏవో శివనారాయణ, డీహెచ్‌వో సుభాషిణి, పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ శాఖలు ఆరు రోజుల పాటు బృహత్తర యజ్ఞం నిర్వహించనున్నారు. జిల్లాలోని గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రాలను కేంద్రంగా చేసుకుని ఒక్కో సచివాలయం నుంచి ముగ్గురు సిబ్బంది చొప్పున ఒక బృందంగా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 268 బృందాల్లోని 804 మంది ఉద్యోగులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లనున్నారు.

## ఒక్కొక్కరు రోజుకు 30 ఇళ్ల సర్వే

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామ సచివాలయాల నుంచి 804 మంది ఉద్యోగుల ఒక్కొక్కరు రోజుకు 30 రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేయనున్నారు. ఒక్కో రైతు ఇంటి వద్ద కనీసం 20 నిమిషాలు సర్వే చేయడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఒక గ్రామ సచివాలయ పరిధిలో మూడు క్లస్టర్లుగా విభజించి రైతన్న మీకోసం నిర్వహిస్తారు. ఆయా మండలాల ఏవోలు, హార్టికల్చర్ అధికారులు వీరిని పర్యవేక్షిస్తారు.

## పంచసూత్రాలపై విస్తృత ప్రచారం

రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన పంచసూత్రాలపై ఆర్‌ఎస్‌కే, సచివాలయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించనున్నారు. వీటిలో నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, రైతులకు యూనిక్ ఐడీ నమోదుతో ప్రభుత్వ పథకాల వర్తింపు, వ్యవసాయంలో యంత్రాల వాడకం, టెక్నాలజీ వినియోగం, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, రైతుల పంటలకు ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం నుంచి మద్దతు ధర కల్పించేందుకు, రైతులను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద అందించిన ఆర్థికసాయం, పంట మార్కెటింగ్ లాంటి పంచసూత్రాలను రైతన్న మీకోసంలో రైతులకు వివరిస్తారు.

## ఆరు రోజులు సర్వే..డిసెంబరు 3న నివేదికలు

జిల్లాలో అధికారగణం ఈనెల 24 నుంచి ఆరు రోజుల పాటు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్దకు, పొలాల వద్దకు అడుగులు వేయనుంది. రైతులు ఏయే పంటలు సాగు చేశారు? వాటికి మద్దతు ధర దక్కుతోందా? లాభ, నష్టాల వివరాలు, సాగులో రైతులు ఉపయోగించే ఎరువులు, పురుగుమందుల వివరాలు, పంట చేతికొచ్చాక మార్కెటింగ్, తదితర వివరాలను సేకరిస్తారు. వీటితో పాటు పాడి రంగలో పాలు, మాంసపు ఉత్పత్తుల గురించి, పశుగ్రాసం, పశుదాణా, పశువుల ఆరోగ్యసంరక్షణ తదితర విషయాలను రైతులతో చర్చిస్తారు. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు ఆరు రోజుల పాటు రైతన్న మీకోసం కార్యక్రమం పూర్తి చేస్తారు. 30వ తేదీ ఆదివారం సెలవు, డిసెంబరు 1, 2 తేదీల్లో పింఛన్ల పంపిణీ పూర్తయ్యాక, డిసెంబరు 3వ తేదీ రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతుల నుంచి తెలుసుకున్న, రైతులకు అవసరమైన అంశాల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తారు.

## అదనపు కట్నం కోసం వేధింపులు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తన భర్త జనార్దన్‌రెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మండలంలోని డొంకపల్లె గ్రామానికి చెందిన తారాదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తారాదేవి మొదటి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో పులివెందులకు చెందిన జనార్దన్‌రెడ్డిని రెండేళ్ల కిందట వివాహం చేసుకుంది. ఈ క్రమంలో తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, తనను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

## బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే రహదారిలో కొత్తరోడ్డు వద్ద శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతున్న ఎర్రమల్ల తులశమ్మ (56) అనే మహిళను కడప నుంచి వస్తున్న బీసీ వీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈమెకు తీవ్ర గాయాలయ్యాయి. పెండ్లిమర్రి మండలానికి చెందిన తులశమ్మ చెన్నూరులోని బంధువుల ఇంటికి వచ్చి రోడ్డు దాటుతుండగా కడప నుండి విజయవాడ వెళుతున్న బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ తులశమ్మను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

## ఇరువురి మధ్య ఘర్షణ

చెన్నూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చెన్నూరు ఏపీజీబీ బ్యాంకు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఇరువురి మధ్య గొడవ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నూరుకు చెందిన షఫీవుల్లా ఆటోలో వస్తుండగా చెన్నూరు గ్రామం నుండి బుడ్డాయపల్లెకు వెళుతున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో షఫీవుల్లా బుడ్డాయపల్లె యువకుడిపై దాడికి దిగాడు. అనంతరం షఫీవుల్లా వచ్చే దారిలో మరికొందరు అతనిపై దాడి చేశారు. ఈ సంఘటనపై ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరు వర్గీయులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ముద్దనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్మార్ట్ కిచెన్ భవన ఏర్పాటు విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం స్మార్ట్ కిచెన్ భవన ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయమై కులం పేరుతో దూషించారని ఆదినరసింహులు ఫిర్యాదు మేరకు రాజులగురువాయపల్లెకు చెందిన సురేంద్రనాథరెడ్డి, మరో 10 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమం

చాపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం వద్ద ప్రొద్దుటూరు-మైదుకూరు రహదారిపై ఈనెల 22న శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ (30) తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ కుమార్ ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం మైదుకూరు వెళ్లి తిరిగి వస్తుండగా కేతవరం బస్టాపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతని తల, కాళ్లు, ఇతర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాంసం దుకాణాలపై దాడులు

● కల్తీ మాంసం కాల్చివేత

వేంపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మాంసం దుకాణాలపై పంచాయతీ ఈవో నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కల్తీ మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అనారోగ్యానికి గురైన గొర్రెల మాంసం విక్రయిస్తుండగా పట్టుకుని కల్తీ మాంసం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని కాల్చారు. ఎక్కడైనా కల్తీ మాంసం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.



కల్తీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్న ఈవో

# ఆశాజనకంగా వరి

● 10 వేల ఎకరాల్లో సాగు ● మెరుగైన దిగుబడిపై రైతుల ఆశలు



సాగులో ఉన్న వరి పంట

దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పాలుపోసుకుని గింజలు కడుతున్నాయి. పంట కనిపిస్తున్న తీరును చూసి మెరుగైన దిగుబడులు అందుతాయని రైతులు పేర్కొంటున్నారు. కేసీ ఆయకట్టు పరిధిలో నీటి ఆధారంగా ఈ పంట విస్తృతంగా సాగు చేశారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసిన నేపథ్యంలో సకాలంలో కేసీ కాలువకు నీరు వచ్చింది. దీంతో నార్లుపోయడం, నాట్లు వేయడం జరిగిపోయింది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో వరికి మేలు జరిగింది. కేసీ ఆయకట్టు అంతా వరి పైర్లతో కళకళలాడుతోంది.

### 10 వేల ఎకరాల్లో వరి సాగు

మండల పరిధిలో పదివేల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ-క్రాప్ నమోదైన లెక్కల ప్రకారం 8,360 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా ఈ-క్రాప్ నమోదు కాని, నాన్ ఆయకట్టు కింద, బోరుబావుల కింద మొత్తం కలిపి 10 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది స్థానిక కూలీలతో కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొత్త కూలీలతో నాట్లు వేయించారు. వీరు గాలిబాటలు ఏర్పాటు చేసే విధానం రైతులకు నచ్చి వారితోనే నాటించారు. వీరి వలన ఖర్చు కూడా తగ్గిందని రైతులు చెబుతున్నారు.

### పెరిగిన సాగు ఖర్చులు

నాటు ఖర్చులు కొంత తగ్గినా వరి సాగు ఖర్చులు పెరిగాయి. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలదాకా పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నారు. దుక్కుల దగ్గర నుంచి దమ్ము చేయడం, నాట్లు వేయడం, ఎరువులు, పురుగు మందుల వాడకం, కలుపుతీత ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని వాపోతున్నారు. ఖర్చులు నెత్తికెక్కినా మంచి దిగుబడులు అందుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తపరుస్తున్నారు. మండలంలో దువ్వూరు, కానగూడూరు, జిల్లేళ్ల, పెద్దజొన్నవరం, మురళీనగర్, ఎర్రబల్లి, మాచనపల్లి అన్నపుశాస్త్రులపల్లి, బుక్కాయపల్లె, నేలటూరు పరిధిలోని కేసీ ఆయకట్టులో వరి సాగు చేశారు. ఇవి కాక పలు గ్రామాల పరిధిలో చెరువులు, బోరుబావుల కింద వరి నాటారు.



గింజలు పోసుకుంటున్న వరి

# పోలీసుల సివిల్ పంచాయితీలు

● చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పోలీసులు బహిరంగంగా సివిల్ పంచాయితీలు చేయడంపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తనికంటి జ్యూవెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్, అతని భార్య శ్రీలక్ష్మీతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు తనికంటి వెంకటస్వామిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు పెట్టి కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, జ్యూవెలర్స్ షాపు తాళాలు ఇంటికి వచ్చి మరీ దౌర్జన్యంగా తీసుకెళ్లే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డబ్బులు బాకీ ఉంటే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవాలని, అలాకాకుండా పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుని దారుణంగా కొట్టి తుపాకులతో బెదిరించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇది ఎస్పీకి తెలియదని, ఆయన పైఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ సివిల్ పంచాయితీల దందా కొందరు పోలీసులు సాగిస్తున్నారని ఆరోపించారు. ఇంత తతంగం జరుగుతున్నా స్థానిక డీఎస్పీ కనీసం నోరు మెదపడం లేదన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మీ డీఎస్పీ కార్యాలయంలో మూడు గంటలున్నా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు శ్రీనివాస్ ఇంటినుండి బలవంతంగా తీసుకెళ్లిన ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు వారికి అప్పగించాలన్నారు. చట్టప్రకారం తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిపై కేసు వుంటే అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సోమా బాలయ్య, వద్దిబాలుడు, ఆడిటర్ పోలంకి వరదరాజులు, చెన్నా శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇంటికి వెళ్లి ఆస్తిపత్రాలు తీసుకుంటున్న సీఐ ఫొటోలు చూపిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

## గోల్డ్ స్కీమ్ పేరుతో తనికంటి జ్యువెలర్స్ వసూళ్లు

● బంగారు, డబ్బులకు కస్టమర్లు ఆందోళన చెందవద్దు : శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తనికంటి జ్యూవెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్ గోల్డ్ స్కీమ్ పేరుతో నెలకు రూ.50వేలు కంతు కట్టించుకున్నారని ఇటీవల అతనిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారని తెలిసి తమ డబ్బులు ఇప్పించాలని ఒన్‌టౌన్ సీఐకి బాపతి సంధ్య ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. మూడేళ్లుగా తమ కుటుంబానికి తనికంటి శ్రీనివాస్ పరిచయస్తుడని, గోల్డ్ స్కీమ్ ప్రారంభిస్తున్నానని, స్కీమ్‌లో చేరాలని చెబితే తమతో పాటు మరికొందరితో గోల్డ్ స్కీమ్ కట్టించామని పేర్కొన్నారు. అలాగే బంగారు ఆభరణాల కోసం బంగారు కూడా ఇచ్చామని, వాటన్నింటికి కలిపి రూ.9.50 లక్షలు రావాల్సివుందని, అది తమకు ఇప్పించాలని ఆమె కోరారు. ఇదిలా వుండగా తనకంటి జ్యువెలర్స్ యజమాని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు తమ కస్టమర్లను భయపెట్టి వారితో బలవంతంగా ఫిర్యాదులు ఇప్పిస్తున్నారని, తమ దగ్గర స్కీములో ఉన్న వారికి గానీ, అభరణాల కోసం బంగారు ఇచ్చిన వారికి గానీ ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. పుకార్లను నమ్మవద్దని కోరారు. తమ దుకాణం తాళాలను పోలీసులు అక్రమంగా వారివద్ద వుంచుకున్నారన్నారన్నారు.

## తుదిశ్వాస వరకు పేదల సేవకే అంకితం

● ముక్కారూపానందరెడ్డి ● ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరానికి వృద్ధులను తీసుకెళ్తున్న ముక్కా రూపానందరెడ్డి... హాజరైన జనం

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తన తుది శ్వాస వరకు పేదల సేవకే అంకితం అవుతానని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణంలో ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి కంటి చూపు కల్పించాలన్న ఉద్దేశంతో ఇలాంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరానికి రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల నుంచి సుమారు మూడువేల మంది హాజరయ్యారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. అలాగే సుమారు 200 మందికి ఆపరేషన్లు చేశారు. జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను ముక్కా ఫౌండేషన్ వేగంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి యువ నాయకుడు పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, నార్జాల హేమరాజ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం - రాగి వైరు చోరీ

మలకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల భవనాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై వాచ్‌మాన్ వెంకటరమణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.



## కడుపు నొప్పితో హోంగార్డు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి రావడంతో మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్ హోంగార్డు ఆర్‌వీ రమణ(47) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా సోమల మండలం నంజంపేటకు చెందిన ఆర్‌వీ రమణ ఆదివారం తాలుకా పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరై మధ్యాహ్నం భోజనానికి తట్టివారిపల్లెకు వెళ్లాడు.

ఇంట్లో కడుపునొప్పి రావడంతో వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్




మాట్లాడుతున్న యాటగిరి రాంప్రసాద్

కడప మారుతీనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని ఏపీ స్టేట్ ఫిష్మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్న నందమూరి తారకరామరావు హయాం నుండి ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు వరకు బీసీలకు అండగా నిలుస్తూ సముచిత స్థానం కల్పించడంలో చొరవ చూపుతున్నారన్నారు. తనపై విశ్వాసంతో పదవి కల్పించిన నాయకుల ఆకాంక్షలకనుగుణంగా సేవలందిస్తానన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలను పరిష్కరించి పదవికి వన్నె తెచ్చేలా పాటుపడతామన్నారు. వైసీపీ జిల్లా నాయకులు చిల్లర రాజకీయాలకు స్వస్తిపలకాలన్నారు. కడప సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చొరవ చూపుతున్నారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు సిగ్గు లేకుండా అవాకులు చవాకులు పేలడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అమర్‌నాథరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు మన్సూర్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా జనసేన

నిమ్మనపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. ఆదివారం విజయవాడ మంగళగిరిలో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024 సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లి వాసి గుమ్మడి శివ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఆ వేదికపై ఎమ్మెల్సీ నాగబాబు రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య జ్యోతికి అందజేశారు. అలాగే రాష్ట్రంలో మొత్తం 220 మంది కార్యకర్తల కుటుంబాలకు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు.

## దువ్వూరు కార్యకర్తకు ఆర్థికసాయం

దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బాషా కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ తరపున రూ.5 లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా చెక్కును మృతుడి తల్లి ఓబుళమ్మకు అందజేసినట్లు మైదుకూరు నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం లక్ష్మీనరసయ్య తెలిపారు.

## గండికోట ప్రాజెక్టులో 26.4 టీఎంసీలు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.4 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు.అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు. ఫోటో 23కొండా1 గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

## 25,26 తేదీల్లో మాజీ సీఎం జగన్ జిల్లా పర్యటన

పులివెందుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25, 26వ తేదీల్లో జిల్లాకు రానున్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బెంగుళూరులో 3గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు. 3.50గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. అనంతరం భాకరాపురంలోని ఇంటికి చేరుకొని అక్కడ బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 8.45గంటలకు బయలుదేరి 9గంటలకు పులివెందులలోని వాసవి ఫంక్షన్ హాల్‌కు చేరుకుని వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 10గంటలకు బయలుదేరి పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను పరిశీలిస్తారు. అనంతరం 11.30గంటలకు పులివెందులలోని లింగాల మాజీ సర్పంచు మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి 12.30గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2గంటలకు బయలుదేరి వేముల మండలంలోని వేల్పుల గ్రామంలోని లింగాల రామలింగారెడ్డి ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి బయలుదేరి 4గంటలకు పులివెందులలోని భాకరాపురం క్యాంప్‌కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. 7.05గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేయనున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

## పోటీల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలి

● విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రారావు సూచన

పులివెందుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే అంతర కళాశాలల పోటీల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు సూచించారు. ఈనెల 24నుంచి 26వ తేదీ వరకు పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో జరిగే క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల ఏర్పాట్లపై ఆదివారం స్థానిక కళాశాల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన 19 కళాశాలల విద్యార్థుల జట్లు పాల్గొంటున్నాయన్నారు. పోటీలకు చేసిన ఏర్పాట్లను పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్, రవాణా, వేదిక అలంకరణ, స్పోర్ట్స్, వసతి ఏర్పాట్లను డీన్ డాక్టర్ ఎం.మాధవ వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్.రవికాంత్‌రెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో బంగారు వ్యాపారి

● వెంకటస్వామి అరెస్టుకు తాడిపత్రికి వెళ్లిన సీఐ తిమ్మారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు వెంకటస్వామిలను శుక్రవారం రాత్రి పోలీసులే కిడ్నాప్ చేసి అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టడంపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు వారిని ఇంటి వద్ద వదిలేసి ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు తీసుకెళ్లడం తెలిసిందే. ఆదివారం ఉదయం తనికంటి శ్రీనివాస్‌ను వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి పోలీసుస్టేషనుకు పిలిపించారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్లో నమోదైన కేసు విషయమై శ్రీనివాస్‌ను అదుపులోఉంచుకున్నారు. కారు తీసుకొని తాడిపత్రిలో వదిలిన తనికంటి శ్రీనివాస్ సోదరుడు వెంకస్వామిని అరెస్టు చేయడానికి సీఐ తిమ్మారెడ్డి వెళ్లారు. అక్కడ వెంకటస్వామి పోలీసులను ఇంట్లోకి రానీయకుండా తలుపులు వేసుకున్నాడు. పోలీసులను నమ్మి రానని తేల్చిచెప్పడంతో అతన్ని అరెస్టు చేసి తీసుకురావడానికి సీఐ తాడిపత్రిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ను వన్‌టౌన్ స్టేషన్‌లోనే రాత్రికి ఉంచారు. నవంబరు 20న నమోదైన కేసులో వీరిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పెట్టడానికి పోలీసులు యత్నిస్తున్నారు. అయితే రూ.8కోట్ల విలువైన ఆస్తిపత్రాలు తనికంటి జ్యువెలర్స్ తాళాలు పోలీసులు అక్రమంగా ఇంటి నుంచి తీసుకెళ్లడంపై పోలీసులు ఎలాంటి వివరణ మీడియాకు ఇవ్వడం లేదు.

## 'డ్రైవర్లూ.. స్టాప్..వాష్ అండ్ గో..'



కడప క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్టాప్.. వాష్.. అండ్ గో కార్యక్రమం పోలీసు యంత్రాంగం చేపడుతోంది. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, వ్యాన్లు తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు మంచినీళ్లు అందించి ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత పంపుతున్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి సురక్షితమైన ప్రయాణం చేయాలని పోలీసు అధికారులు సూచించారు.

# విసుగెత్తిస్తున్న వర్షం..!

**జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. విడతలు విడతలుగా భారీగా వర్షం కురుస్తుండడంతో ఏ పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో నుంచి కాలు బయటికి పెడితే తడిసి పోవలసిందేనని అంటున్నారు. ఇప్పటికే కావలసినంత వర్షం కురిసిందని.. ఇకపై కురిసే వర్షంతో నష్టం తప్ప లాభం లేదని పెనగలూరు మండలవాసులు వ్యాఖ్యానిస్తున్నారు.**



నాగూరువాండ్లపల్లెలో మడుగును తలపిస్తున్న రోడ్డు



రామాపురం: తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

రామాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కారణంగా వరిపైరు నేల కొరగడంతో తీవ్రంగా నష్టపోయా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ.30 వేల వరకు అప్పు చేసి పెట్టుబడి పెట్టామని, వర్షం కారణంగా పైరు నేలకొరగడంతో అప్పులు తీర్చే దెలాగని ప్రశ్నిస్తున్నారు. చేతికి వచ్చిన ధాన్యం సైతం తడిసిపోవడంతో కోలుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి సాగుపై ఆధారపడి జీవించే రైతులకు ఈ వర్షం నష్టదాయకంగా మారిందని అంటున్నారు.

**గాలివీడు:** గాలివీడు- కోనంపేట రహదారిలోని నాగూరు వాండ్లపల్లెలో ఒక మీటరు లోతులో రోడ్డుపై గుంత ఏర్పడింది. ఈ గుంత వర్షపు నీటితో పూర్తిగా నిండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజు వందల సంఖ్యలో వాహ నాలు వెళుతుంటాయి. విషయం తెలియక ద్విచక్ర వాహనాలు ఈ నీటిలో నుంచి వెళితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

# ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం : చమర్తి



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. మండలంలోని ఏపీ ఎస్పీ 11వ బెటాలియన్‌లోని కోదండరామ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన సింగిల్‌విండో అధ్యక్షుడు దారపునేని దశరథనాయుడు సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడ్డ దారపునేని దశరథనాయుడుకు రాష్ట్ర అధినాయకత్వం గుర్తించి సింగిల్‌విండో అధ్యక్షుడుగా నియమించడం హర్షించదగ్గ విషయమని, తెలుగుదేశంపార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, వైసీపీ ప్రజాప్రతినిధులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం చేస్తామని తెలిపారు, సిద్దవటంలో టీడీపీ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని, బూత్ స్థాయిలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తిస్తామని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందని తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు దశరథనాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రజా ప్రతినిధులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీ కోసం చేసిన కృషిని గుర్తించి సింగిల్‌విండో అధ్యక్షుడుగా నియమించి నందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు రాజశేఖర్‌యాదవ్, తదిత రులు పాల్గొన్నారు.

**టీడీపీ కార్యాలయ భవనం పరిశీలన**

సిద్దవటంలో ప్రారంభించనున్న టీడీపీ కార్యాలయ భవనాన్ని జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కానికి ఈ కార్యాలయం వేదికగా నిలుస్తుందన్నారు.

# మానవ సేవే.. మాధవ సేవ సత్యసాయి నినాదం



సంబేపల్లె: సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో అధికారులు

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో సత్యసాయిబాబా సమాజానికి సేవలందించారని ఎంపీడీవో వెంకట సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఆదివారం పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చు కోవాలని కోరారు. అనంతరం స్థానిక ప్రజలు అధికారులతో కలిసి పుట్టపర్తి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సునీల్, పంచాయతీ సెక్రటరీ, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సత్యసాయి ప్రత్యేక పూజలు**

రైల్వేకోడూరురూరల్: సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల సందర్భంగా రైల్వేకోడూరు పట్టణంలోని గిరిజాలేన్‌లో ఆదివారం ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. పట్టణంలోని బాబా భక్తులు మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్‌బాబు, ఇనమాల మహేష్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

**పోలీసు బెటాలియన్‌లో..**

సిద్దవటం: మండలంలోని ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్‌లో ఆదివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి బాబా భారతీయ ఆధ్యాత్మిక గురువు అని, పుట్టపర్తి నుంచి ఎన్నో అద్భుతాలు ప్రదర్శించారని తెలిపారు. అనంతరం సత్యసాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న రమేశ్‌నాయుడు

రాజంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి సందర్భంగా రాజంపేట పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం హిందూ ధర్మప్రచార పరిషత్ అన్నమయ్య జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో భగద్గీత పోటీలు నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, హెచ్‌ఎం సంగరాజు శారద విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి, యూపీ రాయుడు, తుంగా వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచుల సంఘం సన్మానం**

నందలూరు: శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడును నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వైబీఎన్ పల్లెలోని ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. ఈకార్యక్రమంలో రాజంపేట మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ బెస్త సుబ్రమణ్యం, తెలుగుదేశం నాయకులు తుమ్మది శివకుమార్, పొమ్మల శివనరసింహులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ రంగంలో విస్తృతంగా ఉద్యోగావకాశాలు

రాయచోటిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ రంగంలో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయని వె అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎగువ అబ్బవరం సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెటర్నరీ కోర్సులకు డిమాండ్ ఉందన్నారు. వెటర్నరీ చదివిన వారికి రైతు భరోసా కేంద్రాల్లో, ప్రభుత్వ ప్రైవేట్ డెయిరీలు, పశుసంవర్ధక సంస్థలు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఫీడ్ కంపెనీల్లో భారీ స్థాయిలో అకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు డాక్టర్లు మౌలాలి, ప్రత్యూష, ప్రసాద్, రాజశేఖర్, రమేశ్, శివప్రకాశ్, శివమణి, సౌజనయ, నాగేశ్వరి, పావని, రాజశేఖర్‌నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, మధవరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు శాస్త్రవేత్తలుగా మారాలి



వెంకట్రామరాజుకు అవార్డు ప్రదానం (ఫైల్)

రైల్వేకోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తలుగా మారాలని రాష్ట్ర ఆదర్శ రైతు జి. వెంకట్రామరాజు తెలిపారు. భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఈ నెల 8న తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా ఆ యన ఆదివారం మీడియాతో మాట్లాడారు. తాను వాయు సైన్యంలో పని చేసి వచ్చిన తర్వాత నాటుకోళ్లు, ఆవులు, ఉద్యాన పంటలు, జీవన ఎరువుల తయారీ, ఆర్గానిక్ సాగు, కొత్త వంగడాల రూపకల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఇవన్నీ గుర్తించి అవార్డును ప్రదానం చేశారని తెలిపారు.

## ఎల్లమరాజు చెరువుకు జలకళ



చిట్వేలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని రెండో అతిపెద్ద చెరువైన ఎల్లమరాజుచెరువు జలకళ సంతరించుకుంది. చెరువు అలుగుకు రెండు వైపులా నీరు ప్రవహిస్తోంది. చెరువుకు తూర్పు వైపు ఉన్న అలుగు సందర్శకులను ఆకట్టుకుంటోంది.

## ఎస్టీయూ రాయచోటి అర్బన్ కమిటీ ఎన్నిక



అజీజుర్ రెహమాన్ | మధుసూదన్ రెడ్డి | మహమ్మద్ అలీ

రాయచోటిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్టీయూ రాయచోటి అర్బన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడుగా ఎస్. అజీజుర్ రెహమాన్, ప్రధాన కార్యదర్శిగా వీ. మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్. మహమ్మద్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాయచోటి అర్బన్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు 'మానవత' కృషి



డాక్టర్ సాయికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న మానవతా సభ్యులు

రాయచోటి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు మానవత సంస్థ కృషి చేయడం అభినందనీయ మని ప్రముఖ ఎముకల వైద్యుడు సాయికృష్ణారెడ్డి అన్నా రు. ఆదివారం రాయచోటి పట్ట ణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో ఆ సంస్థ అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ రాయచోటి నియోకవర్గంలో విశిష్టమైన సేవలు అందిస్తూ అందరి మన్ననలను పొందుతోందన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం మానవతా సభ్యులు డాక్టర్ సాయికృష్ణారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అరమాటి శివ గంగిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, కోచైర్మన్ షకీల్, ఉమ్మడి జిల్లా సెక్రటరీ వెంకట్రమణనాయుడు, వెంకటేశ్వరెడ్డి, భోజనపు శివ రామకృష్ణ తదితర మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 12 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కుల కోసం అనునిత్యం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలను విద్యార్థు లు, మేధావులు విజయవంతం చేయాలని. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్వేపల్లి నరసింహ, డీవీ రమణ పిలుపునిచ్చారు. ఆదివారం వారు స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 12న తిరుపతి నగరంలో ర్యాలీ అనంతరం ఇందిర మైదానంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి ఎంపిక చేయబడిన 500 మంది ప్రతినిధులు హాజరై విద్యారంగ సమస్యలపై తీర్మానాలు చేస్తార న్నారు.జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిద్, లతీఫ్‌లు పాల్గొన్నారు.

## 'ఎన్జీవో' అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ అలీ

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండ ల ఎన్జీవో సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్ మహమ్మద్ అలీ ఎంపికయ్యారు. ఆదివా రం స్థానిక ఎన్జీవో కార్యా లయంలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్‌కమిటీ సమావేశంలో తాలూకా ఎన్జీ వో సంఘం అధ్యక్షుడు బలరాంరాజు అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో అ సోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. మహమ్మద్‌అలీ, వైస్ ప్రెసిడెంట్‌గా రెడ్డికీర్తి, జాయింట్ సెక్రటరీగా సునీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కొం డూరు బలరామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్‌యాదవ్, అన్నమయ్య జిల్లా అడ్‌హక్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, అబ్బర్వర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మాక్ అసెంబ్లీకి ఆదర్శ పాఠశాల విద్యార్థిని



నూర్ అయేషా

పెనగలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు పెనగలూరు ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షేక్ నూర్‌అయేషా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.సహజ బ్లెస్సీ తెలిపారు. మాక్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఎంపికయ్యారు. పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 30 వరకు పొరుగువారి హక్కులపై ప్రచారం

రాజంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జమాత్ ఇస్లామి హింద్ సంస్థ నవంబరు 21 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా పొరుగువారి హక్కులు అనే అంశంపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జమాత్ ఇస్లామి హింద్ అధ్యక్షుడు జనాబ్ ఖాదర్ మొహిద్దీన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని జమాత్ కార్యాలయంలో ఆ సంస్థ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగువారి హక్కులపై మహమ్మద్ ప్రవక్త విశిష్ట బోధనలను విస్తృతంగా ప్రచారం చేయనున్నామన్నారు. సామాజిక సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించడమే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 30న పట్టణంలోని ఎస్ఆర్ కల్యాణ మండపం వేదికగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరు హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మత పెద్దలు పాల్గొన్నారు.

## కొత్తపురమ్మ ఆలయానికి రూ.5 లక్షల విరాళం



దాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యుల

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం కొత్తపురమ్మ ఆలయ నిర్మాణానికి అంకం నాగరత్నమ్మ, అంకం జయచంద్రారెడ్డి, రిటైర్డ్ సిరికల్చర్ అధికారి దంపతులు వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ టైల్స్ ఏర్పాటు కోసం ఐదు లక్షల రూపాయలు అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సాధు రాజగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమని ఇలాంటి దాతలను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25,26 తేదీల్లో జగన్ జిల్లా పర్యటన

పులివెందుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25, 26వ తేదీల్లో జిల్లాకు రానున్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బెంగుళూరులో 3గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు. 3.50గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. అనంతరం భాకరాపురంలోని ఇంటికి చేరుకొని అక్కడ బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 8.45గంటలకు బయలుదేరి 9గంటలకు పులివెందులలోని వాసవి ఫంక్షన్ హాల్‌కు చేరుకుని వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 10గంటలకు బయలుదేరి పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ పల్లెలో అరటి తోటలను పరిశీలిస్తారు. అనంతరం 11.30గంటలకు పులివెందులలోని లింగాల మాజీ సర్పంచు మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి 12.30గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2గంటలకు బయలుదేరి వేముల మండలంలోని వేల్పుల గ్రామంలోని లింగాల రామలింగారెడ్డి ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి బయలుదేరి 4గంటలకు పులివెందులలోని భాకరాపురం క్యాంప్ కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. 7.05గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేయనున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

## పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ అమలు ఆలస్యమవుతున్న కారణంగా 30శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మదనపల్లి డివిజన్‌లోని రామసముద్రం మండల ఎస్టీయూ కౌన్సిల్ 30వసంతాల సందర్భంగా హార్సిలీహిల్స్‌లోని ప్రైవేటు అతిథిగృహంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సివున్న పీఆర్సీ ఆలస్యమైనందున ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలన్నారు. 12 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ ఎంఈ మద్దతుతో డిసెంబరు9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు శివారెడ్డి, మధుసూదన, గంటామోహన్, మురళి, రాజారెడ్డి, అయూబ్, రమాదేవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం వేధింపులు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తన భర్త జనార్దన్‌రెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మండలంలోని డొంకపల్లె గ్రామానికి చెందిన తారాదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తారాదేవి మొదటి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో పులివెందులకు చెందిన జనార్దన్‌రెడ్డిని రెండేళ్ల కిందట వివాహం చేసుకుంది. ఈ క్రమంలో తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, తనను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

## మాంసం దుకాణాలపై దాడులు

● కల్తీ మాంసం కాల్చివేత

వేంపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మాంసం దుకాణాలపై పంచాయతీ ఈవో నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కల్తీ మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అనారోగ్యానికి గురైన గొర్రెల మాంసం విక్రయిస్తుండగా పట్టుకుని కల్తీ మాంసం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని కాల్చారు. ఎక్కడైనా కల్తీ మాంసం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# ఆశాజనకంగా వరి

● 10 వేల ఎకరాల్లో సాగు ● మెరుగైన దిగుబడిపై రైతుల ఆశలు



సాగులో ఉన్న వరి పంట


దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పాలుపోసుకుని గింజలు కడుతున్నాయి. పంట కనిపిస్తున్న తీరును చూసి మెరుగైన దిగుబడులు అందుతాయని రైతులు పేర్కొంటున్నారు. కేసీ ఆయకట్టు పరిధిలో నీటి ఆధారంగా ఈ పంట విస్తృతంగా సాగు చేశారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసిన నేపథ్యంలో సకాలంలో కేసీ కాలువకు నీరు వచ్చింది. దీంతో నార్లుపోయడం, నాట్లు వేయడం జరిగిపోయింది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో వరికి మేలు జరిగింది. కేసీ ఆయకట్టు అంతా వరి పైర్లతో కళకళలాడుతోంది.

### 10 వేల ఎకరాల్లో వరి సాగు

మండల పరిధిలో పదివేల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ-క్రాప్ నమోదైన లెక్కల ప్రకారం 8,360 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా ఈ-క్రాప్ నమోదు కాని, నాన్ ఆయకట్టు కింద, బోరుబావుల కింద మొత్తం కలిపి 10 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది స్థానిక కూలీలతో కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొత్త కూలీలతో నాట్లు వేయించారు. వీరు గాలిబాటలు ఏర్పాటు చేసే విధానం రైతులకు నచ్చి వారితోనే నాటించారు. వీరి వలన ఖర్చు కూడా తగ్గిందని రైతులు చెబుతున్నారు.

### పెరిగిన సాగు ఖర్చులు

నాటు ఖర్చులు కొంత తగ్గినా వరి సాగు ఖర్చులు పెరిగాయి. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలదాకా పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నారు. దుక్కుల దగ్గర నుంచి దమ్ము చేయడం, నాట్లు వేయడం, ఎరువులు, పురుగు మందుల వాడకం, కలుపుతీత ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని వాపోతున్నారు. ఖర్చులు నెత్తికెక్కినా మంచి దిగుబడులు అందుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తపరుస్తున్నారు. మండలంలో దువ్వూరు, కానగూడూరు, జిల్లేళ్ల, పెద్ద జొన్నవరం, మురళీనగర్, ఎర్రబల్లి, మాచనపల్లి అన్నపుశాస్త్రులపల్లి, బుక్కాయపల్లె, నేలటూరు పరిధిలోని కేసీ ఆయకట్టులో వరి సాగు చేశారు. ఇవి కాక పలు గ్రామాల పరిధిలో చెరువులు, బోరు బావుల కింద వరి నాటారు.



గింజలు పోసుకుంటున్న వరి

# పోలీసుల సివిల్ పంచాయితీలు

● చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పోలీసులు బహిరంగంగా సివిల్ పంచాయితీలు చేయడంపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తనికంటి జ్యువెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్, అతని భార్య శ్రీలక్ష్మీతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు తనికంటి వెంకటస్వామిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు పెట్టి కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, జ్యువెలర్స్ షాపు తాళాలు ఇంటికి వచ్చి మరీ దౌర్జన్యంగా తీసుకెళ్లే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డబ్బులు బాకీ ఉంటే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవాలని, అలాకాకుండా పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుని దారుణంగా కొట్టి తుపాకులతో బెదిరించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇది ఎస్పీకి తెలియదని, ఆయన పైఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ సివిల్ పంచాయితీల దందా కొందరు పోలీసులు సాగిస్తున్నారని ఆరోపించారు. ఇంత తతంగం జరుగుతున్నా స్థానిక డీఎస్పీ కనీసం నోరు మెదపడం లేదన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మీ డీఎస్పీ కార్యాలయంలో మూడు గంటలున్నా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు శ్రీనివాస్ ఇంటినుండి బలవంతంగా తీసుకెళ్లిన ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు వారికి అప్పగించాలన్నారు. చట్టప్రకారం తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిపై కేసు వుంటే అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సోమా బాలయ్య, వద్దిబాలుడు, ఆడిటర్ పోలంకి వరదరాజులు, చెన్నా శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇంటికి వెళ్లి ఆస్తిపత్రాలు తీసుకుంటున్న సీఐ ఫొటోలు చూపిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

## గోల్డ్ స్కీమ్ పేరుతో తనికంటి జ్యువెలర్స్ వసూళ్లు

● బంగారు, డబ్బులకు కస్టమర్లు ఆందోళన చెందవద్దు : శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తనికంటి జ్యువెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్ గోల్డ్ స్కీమ్ పేరుతో నెలకు రూ.50వేలు కంతు కట్టించుకున్నారని ఇటీవల అతనిపై పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేశారని తెలిసి తమ డబ్బులు ఇప్పించాలని ఒన్‌టౌన్ సీఐకి బాపతి సంధ్య ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. మూడేళ్లుగా తమ కుటుంబానికి తనికంటి శ్రీనివాస్ పరిచయస్తుడని, గోల్డ్ స్కీమ్ ప్రారంభిస్తున్నానని, స్కీమ్‌లో చేరాలని చెబితే తమతో పాటు మరికొందరితో గోల్డ్ స్కీమ్ కట్టించామని పేర్కొన్నారు. అలాగే బంగారు ఆభరణాల కోసం బంగారు కూడా ఇచ్చామని, వాటన్నింటికి కలిపి రూ.9.50 లక్షలు రావాల్సివుందని, అది తమకు ఇప్పించాలని ఆమె కోరారు. ఇదిలా వుండగా తనకంటి జ్యువెలర్స్ యజమాని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు తమ కస్టమర్లను భయపెట్టి వారితో బలవంతంగా ఫిర్యాదులు ఇప్పిస్తున్నారని, తమ దగ్గర స్కీములో ఉన్న వారికి గానీ, అభరణాల కోసం బంగారు ఇచ్చిన వారికి గానీ ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. పుకార్లను నమ్మవద్దని కోరారు. తమ దుకాణం తాళాలను పోలీసులు అక్రమంగా వారివద్ద వుంచుకున్నారన్నారన్నారు.

## తుదిశ్వాస వరకు పేదల సేవకే అంకితం

● ముక్కా రూపానందరెడ్డి ● ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరానికి వృద్ధులను తీసుకెళ్తున్న ముక్కా రూపానందరెడ్డి... హాజరైన జనం

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తన తుది శ్వాస వరకు పేదల సేవకే అంకితం అవుతానని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణంలో ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి కంటి చూపు కల్పించాలన్న ఉద్దేశంతో ఇలాంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరానికి రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల నుంచి సుమారు మూడువేల మంది హాజరయ్యారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. అలాగే సుమారు 200 మందికి ఆపరేషన్లు చేశారు. జనసేన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను ముక్కా ఫౌండేషన్ వేగంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి యువ నాయకుడు పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, నార్జాల హేమరాజ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పఠాన్ మౌలా, నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం - రాగి వైరు చోరీ

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల భవనాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై వాచ్‌మాన్ వెంకటరమణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.



## కడుపు నొప్పితో హోంగార్డు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి రావడంతో మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్ హోంగార్డు ఆర్‌వీ రమణ(47) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా సోమల మండలం నంజంపేటకు చెందిన ఆర్‌వీ రమణ ఆదివారం తాలుకా పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరై మధ్యాహ్నం భోజనానికి తట్టివారిపల్లెకు వెళ్లాడు.

ఇంట్లో కడుపునొప్పి రావడంతో వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్




మాట్లాడుతున్న యాటగిరి రాంప్రసాద్

కడప మారుతీనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని ఏపీ స్టేట్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్న నందమూరి తారకరామారావు హయాం నుండి ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు వరకు బీసీలకు అండగా నిలుస్తూ సముచిత స్థానం కల్పించడంలో చొరవ చూపుతున్నారన్నారు. తనపై విశ్వాసంతో పదవి కల్పించిన నాయకుల ఆకాంక్షలకనుగుణంగా సేవలందిస్తానన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలను పరిష్కరించి పదవికి వన్నె తెచ్చేలా పాటుపడతామన్నారు. వైసీపీ జిల్లా నాయకులు చిల్లర రాజకీయాలకు స్వస్తిపలకాలన్నారు. కడప సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చొరవ చూపుతున్నారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు సిగ్గు లేకుండా అవాకులు చవాకులు పేలడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అమర్‌నాథరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు మన్సూర్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా జనసేన

నిమ్మనపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. ఆదివారం విజయ వాడ మంగళగిరిలో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024 సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లి వాసి గుమ్మ డి శివ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఆ వేదిక పై ఎమ్మెల్సీ నాగబాబు రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య జ్యోతికి అందజేశారు. అలాగే రాష్ట్రంలో మొత్తం 220 మంది కార్యకర్తల కుటుంబాలకు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు.

## దువ్వూరు కార్యకర్తకు ఆర్థికసాయం

దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బాషా కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ తరపున రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ నాగబాబు చేతులమీదుగా చెక్కును మృతుడి తల్లి ఓబుళమ్మకు అందజేసినట్లు మైదుకూరు నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం లక్ష్మీనరసయ్య తెలిపారు.

## గండికోట ప్రాజెక్టులో 26.4 టీఎంసీలు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.4 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు.అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.



ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు

## వివాదాస్పదమని తెలిసినా... నిర్మాణం !

● నిలిపివేసిన రెవెన్యూ అధికారులు

పీలేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం పద్మావతి నగర్ ముఖద్వారంలో సర్వే నెం.139లోని ఓ లాడ్జికి ఆనుకుని చిన్న ప్రభుత్వ స్థలం ఉంది. 90వ దశకంలో అక్కడ గ్రామ పంచాయతీ తరపున మరుగుదొడ్లు నిర్మించాలని అప్పటి పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. అప్పట్లోనే ఆ మేరకు పాలకమండలి తీర్మానం కూడా చేసింది. ఆ తరువాత వచ్చిన పాలకమండళ్లు ఎందుచేతనో దాని గురించి పట్టించుకోలేదు. ఈలోపు ఆ స్థలానికి పలు రికార్డులు పుట్టుకొచ్చాయి. ఆ స్థలం తమదంటే తమదని ప్రైవేటు వ్యక్తులు కొందరు కోర్టుల్లో దావాలు కూడా నడుపుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అక్కడ ఎవరో ఒకరు నిర్మాణాలు చేపట్టడం, రెవెన్యూ అధికారులు నిలిపేయడం, ఆ తరువాత దాని గురించి వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి ఆ స్థలంలో కొందరు నిర్మాణం ప్రారంభించారు. ఆ విషయం తెలిసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురగయ్య, ఆర్ఐ సుధాకర్ అడ్డుకున్నారు. వారి వద్ద ఉన్న రికార్డులు తహసీల్దారు కార్యాలయంలో చూపి అనంతరం నిర్మాణాలు చేసుకోవచ్చని సూచించారు. అయితే ఈ తంతుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలు జరిగిప్పుడు హడావుడి చేసే అధికారులు ఆ తరువాత దాని గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. అలా కాకపోయినా దానికి ప్రహరీ అయినా నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో బంగారు వ్యాపారి

● వెంకటస్వామి అరెస్టుకు తాడిపత్రికి వెళ్లిన సీఐ తిమ్మారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు వెంకటస్వామిలను శుక్రవారం రాత్రి పోలీసులే కిడ్నాప్ చేసి అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టడంపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు వారిని ఇంటి వద్ద వదిలేసి ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు తీసుకెళ్లడం తెలిసిందే. ఆదివారం ఉదయం తనికంటి శ్రీనివాస్‌ను వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి పోలీసుస్టేషనుకు పిలిపించారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్లో నమోదైన కేసు విషయమై శ్రీనివాస్‌ను అదుపులోఉంచుకున్నారు. కారు తీసుకొని తాడిపత్రిలో వదిలిన తనికంటి శ్రీనివాస్ సోదరుడు వెంకస్వామిని అరెస్టు చేయడానికి సీఐ తిమ్మారెడ్డి వెళ్లారు. అక్కడ వెంకటస్వామి పోలీసులను ఇంట్లోకి రానీయకుండా తలుపులు వేసుకున్నాడు. పోలీసులను నమ్మి రానని తేల్చిచెప్పడంతో అతన్ని అరెస్టు చేసి తీసుకురావడానికి సీఐ తాడిపత్రిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ను వన్‌టౌన్ స్టేషన్‌లోనే రాత్రికి ఉంచారు. నవంబరు 20న నమోదైన కేసులో వీరిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పెట్టడానికి పోలీసులు యత్నిస్తున్నారు. అయితే రూ.8కోట్ల విలువైన ఆస్తిపత్రాలు తనికంటి జ్యువెలర్స్ తాళాలు పోలీసులు అక్రమంగా ఇంటి నుంచి తీసుకెళ్లడంపై పోలీసులు ఎలాంటి వివరణ మీడియాకు ఇవ్వడం లేదు.

## కలికిరిలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కలికిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులు జరిగే ఈ అండర్-14 పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరవుతున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఝాన్సీరాణి తెలిపారు. 500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు కలిసి 600మంది పైబడి హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఆదివారం కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆర్.యోగేష్ రెడ్డితో కలిసి వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా మైదానంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నటరాజన్, ప్రకాశ్, వ్యాయామఉపాధ్యాయులు చెన్నప్ప, రెడ్డివరప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు విశేషపూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేసిన అనంతరం అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. భక్తులకు అనుగుణంగా ఆలయ సిబ్బంది వసతులను కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజన్ననాయుడు, ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.





అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు

# సేవా మార్గానికి ప్రతి రూపం

## వేడుకగా సత్య సాయి శతజయంత్యుత్సవాలు ● పేదలకు అన్నదానం, ఆస్పత్రిలో పండ్లు, స్వెట్టర్లు పంపిణీ



వాల్మీకిపురంలో విశేష పూజలందుకుంటున్న సత్యసాయిబాబా

వాల్మీకిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా సేవా మార్గానికి ప్రతి రూపమని వక్తలు అన్నారు. సత్యసాయి బాబా శతజయంత్యుత్సవాలు వేడుకగా చేశారు. ఆదివారం వాల్మీకిపురంలో వేడుకలు నిర్వహించారు. సత్యసాయిబాబా మందిరంలో ఉదయం పతాకా విష్కరణ, స్వామివారికి అభిషేకాలు, విశేషాలంకరణలతో పూజలు, భక్తజనం నడుమ వ్రత వేడుకలు జరిగాయి. సాయి భక్తుల నగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక



వాల్మీకిపురంలో భజన చేస్తున్న సత్యసాయి భక్తులు

ప్రభుత్వ వైద్యశాలలో బాలింతలకు పండ్లు, బ్రెడ్డు, బిడ్డలకు స్వెటర్లు పంపిణీ చేశారు. నిరుపేదలకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. సత్యసాయి సేవా సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### ఎంపీడీఓ కార్యాలయంలో...



సత్యసాయి బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పీలేరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో బాబా చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ పేద రోగులకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి, అధికారులు కృష్ణకిశోర్, ఎంపీడీఓ శివశంకర్, యుగంధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. సచివాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఆదివారం ఉదయం సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు, బోర్ మెకానిక్ చంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహులు, మడుమూరు బాస్కర్ నాయుడు, తమక శంకర, సికిందర్, గౌస్‌పీర్, పంచాయతీ కార్మికులు, మండల కార్యాలయ సిబ్బంది బాగ్యమ్మ, అంజలీ తదితరులు పాల్గొన్నారు.

### తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా సేవా మార్గానికి ప్రతి రూపమని జిల్లా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పీడీ సాయి బాబా చిత్రప టానికి నివాళులర్పించారు. సత్యసాయి బాబా లక్షల మందిని సేవా మార్గంలో నడిపించారని, తన సేవల ద్వారా ఎందరికో తాగు నీరు అందించారన్నారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్యమం దించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాహూజీ పట్నాయక్, ఏపీఓ అంజనప్ప, ఉపాధి, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### గుర్రంకొండ, కలకడల్లో...



కలకడలో బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

గుర్రంకొండ, కలకడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలను గుర్రంకొండ, కలకడ ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించారు. బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు పరమేశ్వరరెడ్డి, భానుప్రసాద్, నేతలు పొత్తూరి శ్రీకాంత్, రైస్‌మిల్ రమణ, బాబునాయుడు, ఇనాయతుల్లా, సుజాత, జగదీష్, కార్యదర్శులు శ్రీహరి, నిస్సార్ పాల్గొన్నారు.

### ములకలచెరువులో....



ములకలచెరువులో ఊరేగింపు చేస్తున్న సత్యసాయి భక్తులు

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్‌స్టాండు సర్కిల్‌లో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను నిర్వహించారు. శ్రీ సత్యసాయి భజన మండలి, ఎస్‌ఎస్ జ్యువెలరీస్ యజమానులు కరుణ కుమార్, రామలక్ష్మమ్మ, మణికుమార్ 300 మందికి అన్నదానం చేశారు. అనంతరం పీటీఎం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి బస్‌స్టాండు సర్కిల్ మీదుగా కదిరిరోడ్డు, మదనపల్లె రోడ్లలో సాయిబాబా చిత్రపటాన్ని పూలతో అలంకరించి ఊరేగించారు. భజన మండలి సభ్యులు బాలిరెడ్డి, మెడికల్ స్టోర్ రమణ, మదన్‌మోహన్, గోవిందు, రెడ్డెప్ప, కోటయ్య, మునిస్వామి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### రామసముద్రంలో...



రామసముద్రంలో కేక్ కట్ చేస్తున్న ఆల్ ఇండియా ట్రస్ట్ సభ్యురాలు సావిత్రిదేవి శ్రీహరన్

రామసముద్రం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యసాయిబాబా ఆశ్రమంలో సత్యసాయి ఆల్ ఇండియా ట్రస్టు సభ్యురాలు సావిత్రిదేవి శ్రీహరన్ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్రిదేవి శ్రీహరన్ చేతులు మీదుగా భారీ కేక్ కట్ చేసి భక్తులకు పంచి, అన్నదానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు విద్యా బోధనతో పాటు వసతులు కల్పిస్తున్నామని వృద్ధులకు ప్రతి రెండు నెలలకోసారి నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. శ్రీసత్యసాయిబాబా కుల, మత, వర్గ బేదాలకు అతీతంగా అన్ని మతాలను సమానంగా చూసే దైవిక దృష్టికోణాన్ని బోధించిన మహనీయులని బాబా చివరి శ్వాస వరకు సేవా విలువలను ఆచరణలో పెట్టిన వ్యక్తిత్వం ఆయన కొనియాడారు. రాయలసీమ ప్రాంతాల్లో శుద్ధి చేసిన తాగునీటి ప్రాజెక్టులను నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చడం, ఆధునిక వైద్యం ఉచితంగా అందించే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలు, కళాశాలలు స్థాపించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు ఆయన సేవా గుణానికి నిదర్శనమన్నారు.



వాల్మీకిపురం ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు, స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

### బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో...



సాయిబాబా జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ

బి.కొత్తకోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంత్యుత్సవాలు వేడుకగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక ఆయుర్వేద వైద్యులు, సత్యసాయి సేవాసమితి గౌరవాధ్యక్షుడు వివిరెడ్డి, షాజహాన్‌బాష ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ శాంతి, సేవ, ప్రేమతో సాయిబాబా జీవితాన్ని గడపడం, వాటినే మానవాళి అనుసరించాల్సిన మార్గాలుగా ప్రబోధించారన్నారు. ప్రజలందరూ శాంతి మార్గంలో నడిచి, ప్రశాంతమైన జీవనవిధానాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం పలువురికి వస్త్రదానం, అన్నదానం చేశారు. పట్టణ ప్రముఖులు కుడుం శ్రీనివాసులు, నారాణయణ స్వామిరెడ్డి, బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, టి.మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీల జీవితాలు ఛిద్రం



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

పీలేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో రాష్ట్రంలోని ఆదివాసీల జీవితాలు ఛిద్రమైపోతున్నాయని ఏపీ గిరిజన యానాది సేవా సంఘం(ఏపీజీవైఎస్‌ఎస్) జిల్లా అధ్యక్షుడు కిల్లా విజయ్ కుమార్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడు రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏపీజీవైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. అటవీ సంపద అక్కడి గిరిజనులకే చెందాలన్న రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలను సైతం కాలరాస్తూ కేంద్రం, గిరిజనులకు అన్యాయం చేస్తోందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, ఖర్చు చేసిన నిధుల గురించి శ్వేతపత్రం విడుదల చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నేతలు తుమ్మల ధరణీ కుమార్, బద్దె భానుప్రకాశ్, టీఎల్ వెంకటేశ్, మలతోటి నరేశ్, ఎద్దుల మహేశ్, సాయి సంపత్, జెట్టి మల్లికార్జున, వేలూరు పురుషోత్తం, మల్లికార్జున, రామచంద్ర, ఇరగన్న, గుర్రప్ప పాల్గొన్నారు.

## నేటి నుంచి మండలంలో 'రైతన్నా.. మీకోసం'

కలికిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మండలంలో 'రైతన్నా.. మీకోసం' పేరుతో వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల ఏఓ ఎం.హేమలత చెప్పారు. 29 వరకూ జరిగే ఈ కార్యక్రమాలను సచివాలయ స్థాయిలో రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. దీని కోసం ఏర్పాటవుతున్న ఉద్యోగుల బృందం ఆ గ్రామంలో ప్రతి రైతు కుటుంబం చెంతకు వెళ్లి వారు సాగు చేస్తున్న పంటలు, వాటి దిగుబడులు, వ్యవసాయ యంత్రాల అందుబాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతుల అభిప్రాయాలను, వారి అవసరాలను గురించి వివరాలు సేకరిస్తామని తెలిపారు. దీంతోపాటు వారోత్సవాల చివరి రోజున ప్రతి రైతు సేవా కేంద్రంలో వర్క్‌షాపులు ఏర్పాటు చేస్తున్నామని ఆమె వివరించారు. ప్రస్తుత రబీతో, రానున్న ఖరీఫ్, రబీ సీజన్లకు అనువైన వ్యవసాయ ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే టీమ్‌లో సహాయకులుగా సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొంటారని హేమలత విశదీకరించారు.

## 29న పడి పూజ మహోత్సవం

మదనపల్లె అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 29న పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ ఆలయంలో 28న భగవతి సేవ, 29న ఉదయం గణపతి హోమం, కలశాభిషేకం, సాయంత్రం కేరళలోని శబరిమలై అయప్ప స్వామి ఆలయంలో మాలికాపురం మున్‌మేల్‌శాంతి మనోజ్ స్వామిచే అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబరు 14 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు ఆలయంలో స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, నిత్య పూజలు నిర్వహిస్తున్నామని, అయ్యప్ప మాలధారులకు రెండు పూటలా అన్న వితరణ జరుగుతోందన్నారు. డిసెంబరు 11న అయ్యప్ప గ్రామోత్సవం, 27న ఆరాటు ఉత్సవం, జనవరి 14న అయ్యప్ప మకరజ్యోతి దర్శనం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు మొత్తం శుభ్రపరచడం, ఆలయం లోపల సిమెంట్ పరుపు వేస్తున్నారన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మార్పూరి సుధాకర్ నాయుడు, ఆర్ రాజశేఖర్‌రెడ్డి (జర్మనీరాజు), ఎన్ రమణ రావు, బాలు, పి.భగవాన్, శివమూర్తి, అమర, ఆనంద నాయుడు, ఢంకనాచారి, మహేష్, ఎవి రమణ పాల్గొన్నారు.

## సామాజికాభివృద్ధిని సాధిద్దాం

### ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌పులి

మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముస్లిం ఐక్యవేదిక విద్య, ఉపాధి, ఆరోగ్యం, మహిళా సాధికారిత, సామాజికాభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ పులి అన్నారు. ఆదివారం అన్నమయ్య, కడప జిల్లాల ముస్లిం ఐక్యవేదిక గౌరవ సలహాదారుడు డాక్టర్ ఎస్‌కే బాష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలను అప్పగించారు. సంక్షేమంలో సమానత్వం లేదని, వారిని పాతాళంలోకి నెట్టివేయబడుతున్నారని ఆరోపించారు. ముస్లింల ఐక్యవేదిక సంపూర్ణ హక్కుల సాధన కోసం, జాతిని చైతన్య పరుస్తోందన్నారు. చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ కోసం డిసెంబరు 1 నుంచి నంద్యాల నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. డాక్టర్ ఎస్‌కే బాష మాట్లాడుతూ ఏపీలో ఉర్దూ బాషను అధికారిక భాషగా గుర్తింపు ఇవ్వాలన్నారు.

## ఏకగ్రీవంగా ఆపస్ మండల కమిటీ ఎంపిక



ఓబుల్‌రెడ్డి



జయపాల్‌రెడ్డి

పీలేరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉపాధ్యాయ సంఘం పీలేరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సుధాకర్ తెలిపారు. ఆదివారం పీలేరు ఆపస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడిగా అమరనాథ్, ఆర్థిక కార్యదర్శిగా నాగరాజును ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఎస్‌ఆర్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి శివశంకర్, కార్యదర్శి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి

పీలేరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ నెల 30వ తేదీలోగా అర్హుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజూ ఉదయం 6 గంటలకే గ్రామాలకు వెళ్లి గూడులేని పేదల వివరాలను సేకరించాలని చెప్పారు. సమావేశంలో పీలేరు హౌసింగ్ డీఈ రమణయ్య, ఎంపీడీవో శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ ఏర్పాటు

### కన్వీనర్‌గా మార్పూరి సుధాకర్ నాయుడు



మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామం, అయ్యప్ప దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యులను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా మార్పూరి సుధాకర్‌నాయుడు, సభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి (జర్మనీ రాజు), ఎన్ రమణ్‌రావు, భగవాన్, శివమూర్తి, ఆనంద్ నాయుడు, అమర, ఢంకనాచారి, ఏవీ రమణ, మహేష్ కమిటీలో ఉన్నారు.

## నేడు టీడీపీ కమిటీల అబ్జర్వర్ల సమావేశం

బి.కొత్తకోట, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల, పట్టణ టీడీపీ నూతన కమిటీలు, కార్యవర్గ ఎంపిక కోసం నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రస్తుత మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి అన్నారు. బెంగళూరు రోడ్డులోని మైనార్టీ ఫంక్షన్‌హాల్లో సోమవారం జరిగే సమావేశానికి నియోజక వర్గ పరిశీలకులు దినేష్‌రెడ్డి, అబ్జర్వర్లు పటాన్ ఖాదర్‌ఖాన్, శీతప్ప హాజరై కమిటీలను ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ పదవులు కోరుతున్న ఆశావహులందరూ హాజరు కావాలన్నారు. కాగా ఇంతకు మునుపు ఇదే స్థలంలో ఈ పార్టీ కమిటీల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరువర్గాలుగా విడిపోయి ఘర్షణలు పడ్డారు. సోమవారం నాటి సమావేశంలో ఏమి జరుగుతుందో చూడాల్సివుంది.



## సాయంత్రమైతే ట్రాఫికర్...!

### ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుర్రంకొండ బస్ స్టాండులో నిలిచిపోయిన వాహనాలు

గుర్రంకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ అధికమవుతోంది. దీంతో బస్టాండు ప్రాంతంలో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం గుండా కడప-బెంగుళూరు జాతీయ రహదారి ఉంది. ఈ మార్గం గుండా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే పట్టణంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ రోడ్డుపై ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండు ప్రాంతంలో బస్సులు నిలిపినపుడు జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. వాహనాలు రోడ్డుపై నిలిచిపోడంతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే సంత రోజున ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. రోజు సాయంత్రం వేళ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## కలిసి కట్టుగా సత్తాచాటుదాం

### - జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్



కార్యకర్తలు, నేతలతో జనసేన పార్టీ ఇన్‌చార్జి సాయినాథ్

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి సత్తా చాటుదామని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పిలుపు నిచ్చారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తలు, నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించేలా కష్టపడి పని చేయాలన్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేయాలన్నారు. అనంతరం పవన్ కళ్యాన్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన కార్యకర్తలను సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు, మండల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.